క్లుప్తంగా

'పేట'కు రాష్ట్రస్థాయిలో పతకాలు


కాంస్య పతకం గెలుచుకున్న గోపాల్‌నాయక్

నారాయణపేట రూరల్: జాతీయ జావెలిన్ డేను పురస్కరించుకుని సోమవారం హన్మకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నారాయణపేట జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. అండర్ 18 బాలుర విభాగంలో రవికుమార్ సిల్వర్ మెడల్, గోపాల్ నాయక్ కాంస్య పతకం సాధించారు. అండర్ 14 విభాగంలో బస్వంత్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు రమణ, అమరీష్, కోచ్ గణేష్, అనురాధ, క్రాంతి అభినందించారు.

హక్కులపై విద్యార్థులకు అవగాహన

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వలంటీర్ పద్మమ్మ తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, వారి తల్లిదండ్రులకు న్యాయసేవలపై వివరించారు. బాలకార్మిక వ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రమేష్, అశోక్‌రెడ్డి, బాలయ్య, ఆశమ్మ, జ్యోతి, రాధిక, గిరిబాబు పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లలు విడుదల

ఊట్కూరు: మండల మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువులో 75వేల చేపపిల్లలను సంఘం నాయకులు వదిలారు. చెరువులో భారీగా వరదనీరు చేయడంతో సంఘం డబ్బులతో కొనుగోలు చేసిన చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకట్రాములు, కార్యదర్శి వసంత్‌కుమార్, శివరామరాజు, భరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

మాగనూర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక పొదుపు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి డబ్బును పొదుపు చేయాలని, అదే విధంగా సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలని తెలిపారు. విద్యార్థులు పీఎంజేడీవై ద్వారా ఉచిత ఖాతా పొందవచ్చని తెలిపారు. రైతుల రుణ మాఫీ, బీమా పథకాలు వాటి లాభాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఫలితాల్లో సీపూర్ విద్యార్థి ప్రతిభ



నర్వ: మండలంలోని సీపూర్ చెందిన నాగరాజు ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన పెద్ద నర్సింహులు, వెంకటమ్మ దంపతులకు ఒక్కడే కుమారుడు. పదేళ్ల క్రితం తండ్రి మరణించగా మూడు ఏళ్ల క్రితం కరోనాతో తల్లి మృతి చెందింది. ఇతని బాబాయి గోపాల్ ప్రోత్సాహంతో కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ చెందిన రాజుపై అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భగవంతురెడ్డి దాడి చేశాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్‌కు వినతిపత్రం అందించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, పుష్పలత, వెంకటేష్, రాఘవేంద్ర, బాల్‌చందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కృష్ణా: మండల పరిధిలోని కుస్నీ హిందూపూర్ శివారులో ఆదివారం రాత్రి కందులు తీసుకెళ్తున్న లారీబోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ టైర్లు పగిలి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు అడ్డంగా లారీ పడడంతో యాద్గీర్, రాయచూర్ వెళ్లే వాహనాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలిసిన వెంటనే కృష్ణా ఎస్ఐ అక్కడికి చేరుకోని గాయపడిన డ్రైవర్‌ను మక్తల్ ఆస్పత్రికి తరలించారు. లారీని రోడ్డుపై నుంచి పక్కకు తొలగించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా చేనేత దినోత్సవం


జిల్లా కేంద్రంలో చేనేత కార్మికురాలి సన్మానం..


జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

నారాయణపేట టౌన్: చేనేత కార్మికులు నిరంతరం శ్రమిస్తూ జీవనం గడుపుతున్నారని, పనికి తగ్గ వేతనాలు లేక పస్తులు ఉంటున్నారని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని గాంధీనగర్ కాలనీలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నేత కార్మికులకు ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు, నేత కార్మికులకు పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. పట్టణంలో ఎంతో మంది నేతకార్మికులు ఉన్నారని, ఆరోగ్య పరిస్థితి బాగు లేక మగ్గం పనులు కూడా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేత కార్మికులకు ప్రభుత్వం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఆదుకోవాలని అన్నారు. రైతుబంధు మాదిరిగా చేనేత బంధు పథకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమాలపూర్, గోవింద్, శ్రీనివాస్, శ్రీరామ్ నారాయణ, కృష్ణ, అనిల్, శేషాద్రి, వరప్రసాద్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

నారాయణపేట రూరల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళామోర్చ ఆధ్వర్యంలో దూల్‌పేట చేనేత కార్మికులను సన్మానించారు. గాంధీనగర్ వీధిలోని నేతన్నలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రమీళ, సూర్యకళ, నందునామాజి పాల్గొన్నారు.

తరలిన చేనేత కార్మికులు


చిన్నపొర్ల నుంచి తరలివెళ్తున్న చేనేత కార్మికులు

ఊట్కూరు: చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభకు చిన్నపొర్ల నుంచి సోమవారం ప్రత్యేక బస్సులో చేనేత కార్మికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, క్లస్టర్ అధికారి దినేష్‌కుమార్, చంద్రశేఖర్, అంబుబాయి, విఠల్, రమేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయండి


డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారి వెడల్పు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ, ఇతర పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఆయా కాలనీల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల కారణంగా కాలనీల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్డు వెడల్పులో వంద శాతం ఇళ్లు కోల్పోయిన బాధితుల జాబితా తయారు చేయాలని వారికి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూత్పూర్-చించోలి జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలో చేపట్టే రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. రామాలయం నుంచి సయ్యద్ పహాడ్ వరకు చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో చేపట్టిన డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు వెంట విద్యుత్ పనులను సైతం చేపట్టాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, బాలేష్, అజీజ్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంలో వేగం పెంచండి



మాగనూర్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి నిర్మిస్తున్న ప్రహరీగోడ పనులలో వేగం పెంచాలని జీసీడీఓ పద్మనళిని సూచించారు. సోమవారం మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో గల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రహరీ పనులను పరిశీలించి గోడపై భాగంలో గాజుముక్కలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా క్యూరింగ్ చేయాలర్నాన్నరు. పాఠశాల పేరుతో ఆర్చి నిర్మించాలని తెలిపారు. పాఠశాలలో ఏవైన సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి


కొండదొడ్డిలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాదాన్‌పల్లి, కొండదొడ్డిలో పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 44 శివారు గ్రామాలను పంచాయతీలను చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గం కేంద్రంలో 150 పడకల ఆస్పత్రిని మంజూరు చేశామన్నారు. 6 గురుకుల పాఠశాలలు వచ్చాయని, అందులో దాదాపు 800 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, ఎంపీడీఓ శ్రీధర్, వైస్ ఎంపీపీ రామేశ్వరమ్మ, ఎంపీఓ పావనీ, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

మద్దూరు: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చెన్నప్ప కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్ చెందిన చెన్నప్ప ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో సోమవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంట్లో పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులను పార్టీ తరఫున, ప్రభుత్వ పరంగా అన్ని రకాలు ఆదుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, వెంకటయ్య, వెంకట్‌రాములుగౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులకు తాగునీరు లేకపోవడంపై ఆగ్రహం


విద్యార్థులను ప్రశ్నిస్తున్న క్లస్టర్ హెచ్ఎం

మాగనూర్: మండలంలోని నల్లగట్టు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్నం వరకు విద్యార్థులకు తాగునీరు అందకపోగా, వారం రోజులుగా తాగేందుకు మినరల్ నీరు కాకుండా బోరునీరు అందించడంపై క్లస్టర్ హెచ్ఎం వెంకటయ్య, ఎస్ఓ రాధికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా విద్యుత్ సమస్య నెపంతో మధ్యాహ్నం వరకు వంటలు చేయకుండా ఉన్నారని తెలిపారు. సీఆర్పీ సాయంతో బయట నుంచి మినరల్ వాటర్ తెప్పించి ఆయనే పక్కనే ఉండి వంటలు వండించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను కొన్ని పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడగగా కొందరు మాత్రమే సరైన సమాధానాలు చెప్పగా, మరికొంత మంది తడబడ్డారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల లబ్ధికోసమే మత కలహాలు

దామరగిద్ద: రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ ప్రభుత్వం దేశంలో మతకలహాలు సృష్టించి అశాంతిని రేపుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ అన్నారు. సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతులను మండల కార్యదర్శి గోపాల్ జెండా విష్కరణ చేపట్టి ప్రారంభించారు. మోదీ పాలనతో కేంద్రం దివాళ తీసిందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా దేశం జీడీపీ మూడు రెట్లు పడిపోయిందన్నారు. కార్యక్రమంలో జోషి, శివకుమార్, సర్పంచ్ లాలప్ప, హన్మంతు, ప్రకాష్, ఖాజా పాల్గొన్నారు.

'పార్టీ గెలుపు కోసం పనిచేద్దాం'

మద్దూరు: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణరెడ్డి ఇంట్లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులను లక్ష్మీనారాయణరెడ్డి సన్మానించారు. కొత్త, పాత వారనే భేదం లేకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేస్తూ పార్టీ విజయానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింహా, శివరాజ్, సంజీవ్, బాబుస్వామి, మల్లీకార్జున్, మహేందర్‌రెడ్డి, చంద్రమోహన్, మహిపాల్‌గౌడ్, రహీం, చెన్నప్ప పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి


నారాయణపేటలో నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం నాయకులు

మద్దూరు: తెలంగాణ ఉద్యమ కారుడు, ప్రజా గాయకుడు గద్దర్‌కు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పేద ప్రజల పక్షాన తన పాట, ఆటలో ఉద్యమం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నర్సింహ, నాయకులు సంజీవ్, రమేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చంద్రమోహన్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: గద్దర్ మృతిపై తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మహేష్‌గౌడ్ సోమవారం ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

నారాయణపేట రూరల్: గద్దర్ మరణం కళాకారులకు తీరని లోటని ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో గీతాలతో ప్రజలను చైతన్య పర్చిన గొప్ప నాయకుడన్నారు. అదేవిధంగా అంబేడ్కర్ కళాభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంబేడ్కర్ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉద్యమ కిరణం, ప్రజా గాయకుడు ఇక లేరనే వార్త జీర్ణించుకోలేమన్నారు. భౌతికంగా లేకపోయిన పాటల రూపంలో ఎప్పుడూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో శరణప్ప, ఆశప్ప, వెంకట్రాములు, సూర్యకాంత్, గోపాల్, రమేష్, కర్రెప్ప, వెంకటేష్, రంగయ్య, శివకుమార్, సైదప్ప, సత్యనారాయణ పాల్గొన్నారు.


మద్దూరులో..

దామరగిద్ద: గద్దర్ అకాల మరణం తెలంగాణకు తీరని లోటని ఎంపీపీ నర్సప్ప, సీపీఎం మండల కార్యదర్శి నర్సప్ప, సీఐటీయూ నాయకుడు జోషి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

నారాయణపేట రూరల్: చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30గంటలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఏర్పాటు చేశామని, నారాయణపేటలో గ్రౌండ్ స్కూల్, మక్తల్‌లో ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. విజేతలకు మక్తల్‌లో ఈనెల 10న, నారాయణపేటలో 11న బహుమతులు అందిస్తామన్నారు. ఎంఈఓలు వెంకటయ్య, గోపాల్‌నాయక్‌కు బాధ్యత అప్పగించామని హెచ్ఎంలు అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌లు వారికి సహాయకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలు అందజేస్తున్న యువతరం సభ్యులు

మద్దూరు: గతేడాది ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన పదో తరగతి, ఇంటర్, ఇతర పోటీ పరీక్ష విద్యార్థులకు సోమవారం యువతరం సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రతిభ పురస్కారాలను అందజేశారు. కిష్టప్ప మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని, మీరు చదివిన విద్య పది మందికి ఉపయోగపడాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని పోటీతత్వంతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమం చేపట్టిన యువతరం సొసైటీ వ్యవస్థాపకుడు మహిపాల్, కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నర్సింహ, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, కాశీనాథ్, సాయిలు, రఘు, భరత్, అరుణ్, శ్రీనివాచారి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో


రాస్తారోకోలో మాట్లాడుతున్న జోషి

దామరగిద్ద: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జోషి కార్మికుల ధర్నాకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయన్నారు. ఓ వైపు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాలు బారిన పడుతున్నారని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలతో ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రప్ప, శివానంద్, వెంకటప్ప, మహదేవ్, శ్రీనివాస్, చాంద్‌పాషా, రవి, థామస్ పాల్గొన్నారు.

మండల ఏర్పాటులో చొరవ తీసుకోవాలి


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రాము

నారాయణపేట రూరల్: కోటకొండ మండల ఏర్పాటులో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నాయకుడు రాము డిమాండ్ చేశారు. 90వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. సోమవారం సాధన సమితి సభ్యులు దీక్షల్లో కూర్చున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. కార్యక్రమంలో యాదగిరి, ప్రవీన్, రాజు, వెంకట్రాములు, కొంగరిరాములు, బాలకృష్ణ, చెన్నప్ప యాదవ్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష

కోస్గి: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, ముఖ్యంగా కాన్పు అయిన వెంటనే తాగించే ముర్రుపాలతో శిశువు మరింత ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని 15వ వార్డులో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి ముర్రుపాలు తాగించాలని అన్నారు. ప్రస్తుతం పోత పాలను ఎక్కువగా వాడుతున్నారని, పోత పాలతో వచ్చే అనర్థాలను వైద్యులు వివరించారు. ఎప్పటికప్పుడు చిన్నారుల బరువును చూయించుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సరోజ, చంద్రకళ, అనసూయ, ప్రసన్న, అరుణ, రమాదేవి, సులోచన ఉన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు శిక్షణ శిబిరం


క్రీడాకారులకు సూచనలు చేస్తున్న డీవైఎస్ఓ వెంకటేష్‌శెట్టి

నారాయణపేట రూరల్: స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ పొందడానికి అవసరమైన శిక్షణను అందించాలనే లక్ష్యంతో స్థానిక మినీస్టేడియం గ్రౌండ్‌లో సోమవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గతనెల 12న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన 14మంది క్రీడాకారులకు ఆరు రోజుల పాటు వివిధ రకాల క్రీడల్లో తర్ఫీదును అందిస్తున్నట్లు డీవైఎస్ఓ వెంకటేష్‌శెట్టి తెలిపారు. 4, 5వ తరగతులకు చెందిన ఏడుగురు బాలురు, ఏడుగురు బాలికలు ఉన్నారని, క్రీడా పాఠశాల ఎంపిక టెస్టులో అర్హత సాధించే విధంగా వారికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహులు, రిటైర్డ్ పీఈటీ నర్సింహులు, సాయినాథ్, భరత్, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మక్తల్: రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడలకు మండలానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు రిటైర్డ్ పీఈటీ గోపాలం సోమవారం తెలిపారు. నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన మండల కేంద్రంలోని క్రీడమైదానంలో బాలబాలికల ఎంపిక నిర్వహించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిని అభినందనించారు. 10వ తేదీ నుంచి 18 వరకు మక్తల్ పట్టణంలో క్రీడామైదానంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ధన్వాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు నోటు పుస్తకాలు, రాగి పిండి, బెల్లంను సోమవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. అలాగే అన్నపూర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4,500 మంది విద్యార్థులకు పల్లి చెక్కి, ప్యాకెట్ క్యాలెండర్‌లను అందజేశారు.

మద్దూరు: విద్యార్థులు అభ్యాసాలు రాసుకోవడానికి వీలుగా రూపొందిన రెండు నోటు పుస్తకాలను మద్దూరు ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ గోపాల్‌నాయక్ సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులందరికీ ఈ నోటు పుస్తకాలను అందిస్తామని ఆయన తెలిపారు.

మక్తల్: సంగంబండ, చిట్యాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్కతాలను సోమవారం అందజేశారు. కలెక్టర్ చొరవతో విద్యాభివృద్ధికి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేసి 45 రోజుల పాటు పలు సబ్జెక్టుల్లో మెరుగు పరిచేందుకు ఈ బుక్కులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, జ్యోతి, వరలక్ష్మి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణం ఇలా.. నడిచేది ఎలా?


బురదమయంగా మారిన అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణం

నారాయణపేట రూరల్: తమ పని పూర్తి చేసుకునే క్రమంలో ఎవరికీ ఇబ్బంది కలిగిన తమకు అవసరం లేదనే విధంగా వ్యవహరించడం సరిపాటే.. కాని గ్రామ ప్రథమ పౌరుడి హోదాలో ఉండి కనీసం చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తిరిగే ప్రాంగణం అని తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మండలంలోని బైరంకొండ పాఠశాల పాత భవనం మొదటి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఇచ్చారు. గ్రామానికి కొత్త పంచాయతీ భవనం మంజూరు కావడంతో ఇటీవల ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఇదే ప్రాంగణంలో భూమిపూజ చేశారు. దీంతో సర్పంచ్ పనులను ప్రారంభించారు. అయితే పిల్లర్ గుంతల్లో వర్షపునీరు నిలవడంతో మోటార్ సాయంతో దూరంగా పైపు పెట్టి తొలగించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా అంగన్‌వాడీ భవనం ముందు పారవేయించారు. దీంతో బురదమయంగా మారి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందికరంగా తయారు చేశారు. జారి పడిపోతామనే భయంతో అటుగా రావడానికి జంకుతున్నారు. ఇబ్బంది కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్ వారించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రస్తుతం నడుస్తున్న జీపీ బిల్డింగ్‌కు మారుస్తామని హామీ ఇచ్చినా తరలించలేదని, ఇక్కడే కొనసాగిస్తే చిన్న పిల్లలకు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. పిల్లర్‌గుంతల్లో చిన్నారులు పడే ప్రమాదం లేకపోలేదని తల్లిదండ్రులు అంగన్‌వాడీకి పంపడం మానేస్తున్నారు. వెంటనే అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.